మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## డ్రైవర్లు ఫిజికల్ ఫిట్‌నెస్ కలిగి ఉండాలి: అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లు అందరు ఫిజికల్ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని అడిషనల్ ఎస్పీ కె.నాగేంద్రుడు తెలిపారు. బుధవారం ఉదయం నారాయణపేట జల్లా ఎస్పీ కార్యాలయంలో ఈ లర్నింగ్ ట్రైనింగ్ సెండర్‌లో జిల్లాలోని పోలీస్ మోటర్ వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు హాజరై వారితో మాట్లాడుతూ జిలాల్లలో అన్ని పోలీస్ స్టేషన్లలో పెట్రోల్ కార్ విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు ప్రజల రక్షణ, భద్రత కోసం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని, ముందస్తు నేరాలు జరగకుండా చూడాలని సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలని వాహనాన్ని నిర్మానుష్య ప్రాంతాలలో, జనసామర్థ్యం గల ప్రదేశాలలో విజిబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలని తెలిపారు. వాహనానికి ఏదైనా సమస్య వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల మెకానిజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జిపిఎస్ ద్వారా తమ వాహనాలు ఏప టైంలో ఏ రూట్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారో ప్రొజెక్టర్ ద్వారా వెహికల్ రూట్ మ్యాప్‌ను చూపించి, వాహనాలను 30 నిమిషాల కంటే ఎక్కువగా ఆపరాదని నిరంతరం పెట్రోలింగ్ విధులు నిర్వర్తించాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు డేవిడ్ విజయ్‌కుమార్, కృష్ణయ్య, జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎస్పీ

## హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న మాజీమంత్రి

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** వన పర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. గ్రామా లు వెంకటాపురం, అంకూర్, చిమనగుంట పల్లి తాండాలు, చీమనగుంటపల్లి, చిట్యాల తాండాలు, రామగూడెం, అచ్యుతాపురం, చిట్యాల గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు నారాయణ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించడం జరి గింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ చ్చిన మాజీ మంత్రి ఏఐసీసీ కార్యదర్శి,పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ డా.చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ లో కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ గడప గడపకు వెళ్తు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500గ్యాస్ సిలిండర్ అందిస్తామని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, వరి పంటకు రూ.2500 గిట్టుబాటు ధర కల్పిస్తామని ఆరోగ్య శ్రీ రూ.5లక్షల వరకు కల్పిస్తామని అన్నారు. సొంత జాగాల్లో ఇండ్లు నిర్మాణాన్ని కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తామని చేయబోయే అభివృద్ధి పనులని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దివాకర్ యాదవ్, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు రోహిత్, జిల్లెల ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎం.దేవన్న యాదవ్, వంశీ నాగిరెడ్డి,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెంటెపల్లి రాములు, గిరిజన నాయకులు బద్రు నాయక్, శివ నాయక్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నరసింహ, దిలీప్ కుమార్ యాదవ్, శ్రీధర్ సాగర్, ఎల్లస్వామి, ఎంపీటీసీ కుమ్మరి గోవిందు, అశోక్ కుమార్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, రాములు, శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొనడం జరిగింది.



గ్రామాల్లో మహిళలను కలిసిన మాజీ మంత్రి చిన్నారెడ్డి

## రెండవ విడత గొర్రెల పంపిణీ లబ్దిదారుల విచారణ త్వరలో పూర్తి చేయాలి

### గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** రెండవ విడత గొర్రెల పంపిణీకి జాబితాలోని లబ్దిదారుల విచారణ త్వరలో పూర్తి చేయా లని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పశుసం వర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. బుధ వారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై పశు సంవర్ధకశాఖ అధికారి, ఎంపిడిఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ గతంలో జాబితాలోని లబ్దిదారులను పూర్తిస్థాయిలో విచారించాలన్నారు. వలస వెళ్లినవారు ఎంత మంది ఉన్నారు వారిని విచారించి నివేదికలు త్వరగా పంపాలని ఆదేశించారు. వారి కులము ఇతర వివరాలు అన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. నాలుగు మండలాలలో పూర్తి అయిందని, మిగతా మండలాలలో పూర్తి చేయాలని, రెండవ విడత గొర్రెల పంపిణీ కార్య క్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్నందున మండలాల వారిగా నివేదికలను పంపా లని ఆదేశించారు.అనంతరం ఎంపిడిఓలతో మాట్లాడుతూ ఈనెల 14న డా.బి. ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు ప్రతి బస్సులో 50 మంది చొప్పున తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 14న హైదరాబాద్‌లో 125 అడుగుల డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు 300ల మందిని ఆరు బస్సులలో తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. 14న ఉదయం 6.30 గం.లకు బస్సులు తరలి వెళ్లాలని, బస్సులోనే టిఫిన్, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం క్వాలిటీ భోజనం ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో లాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సమయానుకూలంగా హైదరాబాద్ వెళ్లాలన్నారు. సభ ముగిసిన తరువాత వారిని రాత్రి భోజనం చేయించి తిరిగి వారి స్వస్థలాలకు బాధ్యతగా వదిలి పెట్టాల్సి న బాధ్యత అదికారులదే అని ఆదేశించారు. సమావేశంలో ఈడి ఎస్సీ కార్పోరేషన్ రమేష్‌బాబు, డిపిఓ శ్యామ్‌సుందర్, అసిస్టెంట్ డిఆర్‌డిఎ నాగేంద్రం, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## కల్తీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం..!

- తప్పు చేసేవారిని ఎవరిని వదలం
- మహబూబ్‌నగర్‌లో ఇద్దరు చనిపోయిన ఘటనలో కల్తీకల్లు కారణం కాదు
- మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలో విలేఖరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ప్రజల ఆరో గ్య సంరక్షణే తమ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఎవరిని ఉపేక్షించబోమని, ఏది కల్తీ చేసినా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే ఊరుకోమని అ న్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కల్లీ కల్లుతో ఇద్దరు చనిపోయారంటూ మీడియా ఛానళ్లలో వార్తలు వచ్చిన నేపథ్యంలో బుధవారం ఆయన ప్రభుత్వ ప్రధాన ఆసుప త్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడారు. వార్డులలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించారు. సూపరింటెండెంట్ చాంబర్‌లో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు వచ్చిన తర్వాత మృతుల మరణాలకు కారణాలు తెలుస్తాయని మంత్రి తెలిపారు. ఎవరైనా కల్తీకల్లు వల్ల చనిపోయారని తెలిస్తే అందుకు కారణమై న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. చనిపోయిన ఇద్దరిలో ఒక రు ప్రమాదానికి గురయ్యారని, లివర్ పాడైపోవడం, వివిధ కార ణాల వల్ల చనిపోయారని, ఇంకో వ్యక్తి అనాథ అని, అతనికి తరచూ ఫిట్స్ వచ్చేవని,శరీరంలో చాలా అవయవాలు దెబ్బతి న్నందు వలన చనిపోయారని తెలిపారు. ఇందుకు సంబంధించి ఎఫ్ఐఆర్‌తో పాటు, వారి బంధువుల రిపోర్టు కూడా ఉందని వెల్లడించారు. తమ ప్రభుత్వం నిఖచ్చిగా పని చేస్తుందని, ప్రజల ఆరోగ్యంతో ఎవరైనా చెలగాటమాడితే ఊరుకోబోమన్నారు. అస్సాం నుండి లిక్కర్ వస్తుందని తమకు సమాచారం అందితే ఇక్కడి అధికారులు అక్కడికి వెళ్లి పట్టుకోవడం జరిగిందని తెలి పారు. ఐజలో కొందరు అక్రమార్కులు నకిలీ మద్యాన్ని తయా రు చేసి కర్నూలుకు పంపిస్తుంటే అక్కడి అధికారులకు సమాచా రం అందించి పట్టించామని గుర్తు చేశారు. ఒడిశాలోని అభయా రణ్యంలో కల్తీ మద్యాన్ని తయారు చేసి తెలంగాణకు పంపించేం దుకు సిద్ధం చేస్తుంటే దాడిచేసి పట్టుకున్నామని తెలిపారు.నకిలీ మద్యాన్ని,గుడుంబాను కల్తీ కల్లును ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మద్యం కల్తీ మాత్రమే కాకుండా ఆహార పదార్థాల కల్తీ విషయంలోనూ తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడటమే తమ లక్ష్యం అన్నారు. ఆయా టీవీ ఛానెళ్లలో వచ్చిన కథనాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో విచారణ చేయిస్తామని, ప్రజల ప్రాణాల పరిరక్షణలో భాగంగా కల్తీ కల్లు అన్నది లేకుండా చెట్లు పెంచడమే కాకుండా, నీర పాలసీని తీసుకొచ్చామని అన్నారు. జిల్లాలో కల్తీకల్లు వల్ల చనిపోతే మంత్రి స్పందించం లేదని కొన్ని టీవీ ఛానళ్లలో రావడం అబద్ధమని, రిపోర్టులు వచ్చిన తర్వాత పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. కల్తీకల్లు వల్ల చనిపోతే ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని, ఎవరిని వదిలిపెట్టమని, అవసరమైతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు రాగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు 64 శాంపిల్స్‌ను పరీక్షలకు పంపడం జరిగిందని ఏ శాంపిల్లో కల్తీ వచ్చినా చర్య తీసుకుంటామన్నారు. గుట్కా, గంజాయి, జర్దా తదితర మత్తు పదార్థాలను అతిగా తీసుకోవడం వల్ల కూడా కొన్నిసార్లు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తారని మంత్రి తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో ఎంతో మార్పు వచ్చిందని, వైద్య సదుపాయాలు, సౌకర్యాలు మెరుగుపడ్డాయని అన్నారు. రూ. 500 కోట్లతో పాత కలెక్టరేట్ స్థానంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తున్నామని మంత్రి వెల్లడించారు. జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాంకిషన్ వైద్యులు డా. జీవన్, డా.సిరాజుద్దీన్, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, డిఎస్పీ మహేష్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## స్వరాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు..!

**మిషన్ భగీరథతో ఇంటింటికి తాగునీరు**
**త్వరలో ఇల్లులేని పేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు**
**పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి:ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**
**రాజాపూర్‌లో 56మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. రాజాపూర్‌లో 56 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత గ్రామాల్లో పరిస్థితులు మారాయన్నారు. రోడ్లమీద మహిళలు బిందెలు పట్టుకుని బారులుదీరిన పరిస్థితులు నేడు లేవన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లాల ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. వ్యవసాయానికి పెట్టుబడికి డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద రైతులను దృష్టిలో ఉంచుకుని పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 10 వేల రైతుబంధు కింద అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్ అంద జేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. విత్త నాలు, సబ్సిడి కింద ఎరువులు, వ్యవసాయ పరికరాలు అంద జేస్తూ రైతు సంక్షేమ రాజ్యంగా నిలిచిందన్నారు. గతంలో లో ఓల్టేజ్ వల్ల వ్యవసాయ మోటార్లు కాలిపోయి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రైతులు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో ఇప్పుడు ఆ పరిస్థితులు ఉన్నాయా ప్రజలు ఒక సారి గమనించాలన్నారు. ఏ ప్రభుత్వం – మిగతా4లో..



రాజాపూర్‌లో కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## జిల్లాలో తొలిసారిగా గురువారం నుంచి పది మూల్యాంకనం...

- జిల్లాకు నూతనంగా మంజూరైన మూల్యంకన కేంద్రం
- మూల్యంకనలో పాల్గొననున్న నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన 500 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో 10వ తరగ తి ప్రధాన పరీక్షలు మంగళవారం ముగి శాయి. 10వ తరగ తి పరీక్షలు ముగి యడంతో ఇప్పటికే సమాధాన పత్రాలు చేరడంతో మూ ల్యాంకనానికి అధి కారులు ఏర్పాట్లు చే సినట్లు డీఈఓ గోవిం దరాజులు తెలిపారు.జిల్లాకేంద్రంలో మూల్యాంకనకేంద్రాన్ని రాష్ట్ర విద్యా శాఖ ఏర్పాటు చేసిందని, ఈ నెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కొనసాగనుంది, జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రానికి ఇప్పటికే సమాధాన పత్రాలు చేరాయి. మొత్తం 1,36,736 లక్షల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయ నున్నారు. వీటిని నిఘా నేత్రాలు, పోలీసుల భద్రత నడుమ క్యాంప్ అధి కారులు భద్రపరిచారు. మూల్యాంకనం నిర్వహించే –మిగతా4లో..



ఎగ్జమినర్లకు సూచనలు చేస్తున్న డీఈఓ

## ఎన్నికల ఓటరు జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- విచారణ లేకుండా ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించరాదు
- ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి ధృవీకరించాలి..
- పొరపాట్లు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా ఉండాలి: ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా కలెక్టర్‌లు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** ఈ సంవత్సరం సాధారణ ఎన్నికలు ఉన్నందున గత సంవత్సరం నుంచి జాబితా నుంచి తొలగించిన పేర్లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎ న్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎన్నిక ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఓటరు జాబితా లో ఒకే రకమైన ఫోటోలు, ఒకటి కంటే ఎక్కువ కలిగినవి, మరణించిన ఓట ర్లు, స్థానికంగా లేకుండా ఇతర ప్రాంతాల్లో స్థిర పడి నివాసం ఏర్పరుచుకు న్న ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు అయితే తొలగించిన పేర్ల పునఃపరిశీలన చేయాలని సూచించారు. పేర్ల తొలగింపులో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, మరణ ధృవీకరణ పత్రం, ఫారం 7 క్షుణ్ణంగా పరిశీలించాల న్నారు. ఎస్.ఎస్.ఆర్ నిబంధనల ప్రకారం క్షేత్ర స్థాయిలో విచారణలు చేప ట్టాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులను ప్రభుత్వం ద్వారా గౌరవ వేతనం పొందుతున్న వారిని తప్ప ప్రైవేటు ఉద్యోగులు లేదా మహిళా సం ఘాల వ్యక్తులను బీఎల్ఓలుగా నియమించడానికి వీలు లేదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట 3 నియోజకవర్గ పరిధి లోని 16,995 ఓటర్లు డబుల్ ఎంట్రీ ఉన్నట్లు గుర్తించామని, ఇప్పటి వరకు 1236 రెండు చోట్ల కలిగి ఉండటం లేదా స్థానికత మార్పిడి చేసుకున్న ఓటర్ల పేర్లను పూర్తి విచారణ అనంతరమే తొలగించినట్లు తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న 15,769 దరఖాస్తులను నిర్ణిత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీఓలు నాగలక్ష్మి, హన్మనాయక్, ఎన్నికల సూపరింటెండెంట్ రవికుమార్, సెక్షన్ క్లర్క్ అశోక్ తదితరులు ఉన్నారు.

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** ఓటరు జాబితా నుండి తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలన చేసి ధృవీకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవి కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ లతో ఓటర్ జాబితాలో పీఎస్ఈ ఎంట్రీ ధృవీకరణ, ఓటన్ ఎపిక్ కార్డుల జారీ, బూత్ లెవెల్ అధికారుల నియామకం అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐడీఓసీ హాల్ నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ ఫోటో సిమిలర్ ఎంట్రీ మొదటి దఫా క్రింద క్షేత్రస్థాయిలో తొలగించిన ఓట్ల వివరాలు మరోసారి పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన, మరణించిన వారి పేర్లుచ డూప్లికేట్ జాబితా నుండి తోలగించిన ఓట్లకు సంబందించిన సంపూర్ణ సమాచారం తమ వద్ద అందుబాటులో ఉండాలని, తొలగించిన ఓట్ల వివరాలు మరోసారి పరిశీలించిన ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు అవసరమైన డాక్యుమెంట్లు ఉన్నాయో లేదో ధృవీకరించాలని ఆయన పేర్కొన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో బూత్ స్థాయి అధికారులు కీలకపాత్ర పోషిస్తారని, ప్రైవేట్ వ్యక్తులను బూత్ స్థాయి అధికారులుగా నియమించవద్దని, ఎక్కడైనా అలా ఉంటే ఏడు రోజుల్లో తొలగించి ప్రభుత్వ సిబ్బందిని నియమించాలని ఆయన సూచించారు. వీడియో సమావేశం అనంతరం సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఓట్ల జాబితా పై పలు సూచనలు చేసి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఫోటో సిమిలర్ ఎంట్రీలను ఆర్డీఓలు,తహసిల్దార్‌లు ప్రత్యేకంగా పరిశీలించాలని, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా నుండి తొలగించిన పేర్ల వివరాలు మరోసారి పరిశీలించి ఎన్నికల కమీషన్ నిబంధనల మేరచ డాక్యుమెంట్లు, సంతకాలు ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని, డబుల్ ఎంట్రీలో ఒకటి తొలగించాలని అన్నారు. వచ్చేవారం అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించాలని అన్నారు. అలాగే ఈనెల 15న ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికారులను, తహసిల్దార్ లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ పద్మావతి, తహసిల్దార్ రాజేందర్ గౌడ్, సీ సెక్షన్ అధికారి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి ధృవీకరించాలని, పొరపాట్లు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా, ఓటరు జాబితా నుండి తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలన చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైద్రాబాద్ నుండి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవికిరణ్‌తో కలిసి జిల్లా కలెక్టర్‌తో ఓటరు జాబితాలో పిఎస్ఈ ఎంట్రీ ధృవీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, బూత్ లెవల్ అధికారుల నియామకం అంశాలపై విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మట్లాడుతూ ఫొటో సిమిలర్ ఎంట్రీ మొదటి దఫా కింద క్షేత్రస్థాయిలో తొలగించిన ఓట్ల వివరాలు మరోసారి పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన, మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు జాబితా నుండి తొలగించామని, తొలగించిన ఓట్లకు సంబంధించి పూర్తి స మాచారం తమ వద్ద అందుబాటులో ఉండాలని, తొలగించిన ఓట్ల వివరాలు మరోసారి పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అవసరమైన డాక్యుమెంట్లు సంతకాలు ఉన్నాయో లేవో తనిఖీ చేయాలని, కలెక్టర్, రెవె న్యూ డివిజన్ అధికారులను, తహసిల్దార్‌లకు సూచించారు. విడియో కాన్ఫ రెన్స్‌లో ఆర్డీఓ రాములు, నరేష్, ధరణి పాల్గొన్నారు.

**నారాయణపేట ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఈ సంవత్సరం సాధా రణ ఎన్నికలు ఉన్నందున గత సంవత్సరం నుండి జాబితా నుండి తొలగిం చిన పేర్లను మారోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎన్ని కల అదికారులతో విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఓటరు జాబితా లో ఒకే రకమైన ఫొటోలు ఒకటి కంటే ఎక్కువ – మిగతా4లో..





వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలిస్తున్న ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లోపాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి





విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

## ఎమ్మెల్యే చిట్టెంకు పంచాయతీ సెక్రెటరీల వినతి



**మక్తల్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** జూనియర్ పంచాయతీ సెక్రెటరీలుగా నాలుగేళ్ల కాలం పూర్తి చేసుకున్నందుకు భారీ కేక్ కట్ చేసి తమను పర్మినెంట్ చేయాలని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు వినతి పత్రం సమర్పించారు. మహాత్మాగాంధి కలలుగన్న గ్రామ స్వరాజ్యం గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ సెక్రెటరీ ప్రముఖ పాత్ర అని వారి ద్వారానే ప్రస్తుతం గ్రామాలలో అన్ని రకాలుగా సౌకర్యాలు, పాలన అందుతుందని పాలక ప్రభుత్వం చెబుతున్నారని తమ నియామక సందర్భంగా మూడేళ్ల కాలపరిమితి ముగిశాక పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీధర్, మండలాధ్యక్షురాలు వనజమ్మ, ఎంపిఓ పావని, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## స్థాయి సంఘాల సమావేశం..



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘాల సమావేశాలు 1వ, 7వ మరియు 6వ (ప్రణాళిక, ఆర్థిక నిర్మాణ పనులు, సాంఘీక సంక్షేమ)స్థాయి సంఘాలకు జెడ్పీ చైర్ పర్సన్ బి.శాంతకుమారి రవీందర్ అధ్యక్షతన జెడ్పీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా బీసీ అభివృద్ధి, జిల్లా మైనార్టీ సంక్షేమం, జిల్లా గిరిజనాభివృద్ధి, మిషన్ భగీరథ, ఆర్థిక ప్రణాళిక, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జిల్లా రహదారులు మరియు భవనాలు, నీటి పారుదల శాఖల అభివృద్ధి పురోగతి కొత్తగా ప్రతిపాదనలు వివరాలపై చర్చించి సమీక్షించారు. కార్యక్రమంలో స్థాయి సంఘాల జెడ్పీటీసీ సభ్యులు మూడావత్ మంత్ర్యానాయక్, అనంత ప్రతాప్‌రెడ్డి, శ్రీశైలం, జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడు కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం



**కల్వకుర్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన పొల్మూరి మొగులయ్య కల్వకుర్తి మున్సిపాలిటి కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. మొగులయ్య భార్య పొల్మూరి చెన్నమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినది. మృతురాలి కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి భర్త పొల్మూరి మొగులయ్యకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహేద్, కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నీరటి శేఖర్, జనరల్ సెక్రెటరి సత్యనారాయణ, రాధాకృష్ణ, దున్న ఆనంద్, వెంకటేష్, దున్న సురేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

## అన్నార్తులకు అపన్నాహస్తం ఇస్తున్న చేయూత ఆశ్రమం..



**వనపర్తి టౌన్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్న వృద్ధులు, దివ్యాంగులకు చేయూత ఆశ్రమం ఆధ్వర్యంలో వారికి మార్చి 30నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం, సాయంత్రం, రెండు పూటలా భోజనం పెట్టడం జరుగుతుందని చేయూత ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణతో కలిసి వృద్ధులకు భోజనం పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు అన్నం పెట్టి వారి కడుపులు నింపుతున్న చేయూత ఆశ్రమ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కనీసమైనా మానవధర్మం అని, సగటు మానవుడు సామాజిక స్పృహతో మెలగాలని తన సంపదలో శక్తిమేరకు సేవకు కేటాయించాలని ఇతరులకు చేసే గుణంతో ఉండాలని తెలిపారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంబరాలు..



**మహ్మదాబాద్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** నేటితో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొహిబిషన్ పీరియడ్ 4సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గండీడ్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి ఆనందంగా సంబరాలు చేసుకోవడం జరిగింది. కార్యక్రమం లో పంచాయతీ సెక్రెటరీలు మాట్లాడుతూ నేటితో 4సంవత్సరాలు పూర్తయిన సం దర్భంగా వారి అనుభవాలను పంచుకోవడం జరిగింది. అలాగే 4 సంవత్సరాల కాలాన్ని సర్వీస్‌లో కలుపుతూ రెగ్యులరైజ్ జిఓను తొందరగా రిలీజ్ చేసి జూనియర్ పంచాయ తీ సెక్రెటరీలలో ఉద్యోగ భద్రతను కల్పించాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి మాధవి రాజ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటిసి మాచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ రూపేందర్‌రెడ్డి, ఎంపిఓ శంకర్‌నాయక్, ఎపిఓ హరిచంద్ర గాదిర్యాల్, పంచాయతీ కార్యదర్శి హాజి, ఉమ్మడి గండీడ్ మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు..

**ప్రాథమిక వైద్యంపై అందరికి అవగాహన కలిగి ఉండాలి..**

**వసతి గృహ సిబ్బందికి కార్డియోపల్మోనరీ రెసుసిటేషన్ ఒకశిక్షణ..**

**జిల్లా సహాయ బీసీ అభివృద్ధి అధికారి బీరం సబ్బారెడ్డి..**

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** సీపీఆర్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సీపీఆర్ శిక్షణ ఇస్తుందని జిల్లా సహాయ బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డా. నదియా, సాదత్, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బందికి సీపీఆర్ పై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహాయ బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బరెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు చేటో చేసుకోవడంతో వయసుతో సంబంధం లేకుండా గుండె సమస్యలతో కుప్పకూలుతున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో వారిని కాపాడేందుకు సీపీఆర్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ఈ పద్ధతిని అనుసరించి గుండె లయను సాధారణ స్థాయికి తెచ్చే అవకాశం ఉందని అన్నారు. ప్రాథమిక వైద్యం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అత్యవసర పరిస్థితితో ప్రాణాలు కాపాడొచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు ఎస్.ఆంజనేయులు, బీజీ అమృత సాగర్, కె.మాధవి, ఎం.జీవిత, కె.కురుమూర్తి, ఎస్.రమేష్ గౌడ్, జిల్లాలోని వివిధ వసతి గృహాల 4వ తరగతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్ పై శిక్షణ ఇస్తున్న బృందంతో జిల్లా వసతి గృహాల అధికారులు



సీపీఆర్ ఎలా చేయాలో చూయిస్తున్న వైద్య బృందం

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవభారత రాజ్యాంగ నిర్మాత, దళిత జీవిత బాంధవుడు, సమిష్టి సాధనతో సాధించుకున్న స్వాతంత్ర్య భారతదేశాన్ని సరైన సుపరిపాలన జరుపుకునే దేశంగా రూపొందించడానికి తన జీవితాన్ని దార పోసిన బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ ఒక ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత్త, సంఘ సంస్కర్త, స్వతంత్ర్య భారత దేశానికి రాజ్యాంగం ద్వారా దిశ, నిర్దేశం చేసిన రాజ్యాంగ శిల్పి, గొప్ప మేధావి అన్నారు. అణగారిన వర్గాలకు, అంటరాని తనానికి, కుల వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేసిన వ్యక్తి అని, సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తి తన హక్కుల సాధన కోసం పోరాడే అవకాశం కల్పించిన మహాత్ముడని పేర్కొన్నారు. ఆశయాలు ఆచరణలో పెడితే మానవుడే మహానీయుడవుతాడు అని బలంగా నమ్మి నేడు దేశ వ్యాప్తంగా నీరాజనాలు అందుకుంటున్న మరుపులేని మహానీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. అదే విధంగా మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన టి.లూయిస్‌రెడ్డికి మంజూరైన రూ.1లక్ష చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కల్వకుర్తి మున్సిపాలిటికి చెందిన మల్లారెడ్డి ఇటీవల మృతి చెందారు. మల్లారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మలశ్రీశైలం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉప్పల వెంకటేష్

## అంబేద్కర్ జయంతి జాతీయ ఉత్సవాల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్



జడ్పీ చైర్‌పర్సన్‌కు అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్12 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాలజిల్లా కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బుడకల ప్రకాష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా జడ్పీచైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ముఖ్యఅతిథులుగా హాజరై జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలోని మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ప్రగతిశీలమైన ప్రజాస్వామ్యబద్ధమైన అంశాలను ముందుచూపుతో రాజ్యాంగంలో సమానత్వపు హక్కు, స్వేచ్ఛహక్కు, దోపిడిని వ్యతిరేకించే హక్కు, మత స్వాతంత్రపు హక్కు, సాంస్కృతిక, విద్యాహక్కు, రాజ్యాంగ పరిహార హక్కులను అంబేద్కర్ పొందుపర్చారన్నారు. అనంతరం అక్కడి నుండి సభాస్థలి వరకు భారీ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనాలు కాదు...ఆత్మ ప్రబోధ సభ పెట్టుకోండి..



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

**కల్వకుర్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ శాసనసభ్యులు ఆత్మీయ సమ్మేళనాలు కాదు... ఆత్మ ప్రబోధ సభలు నిర్వహించుకోవాలని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనాలతో ప్రజల జీవితాలను గుగ్గిపాలు చేస్తున్నారని బీఆర్ఎస్ శాసన సభ్యులు గత 5 సంవత్సరాలుగా ప్రజలకు దూరమై సమస్యలకు దగ్గరై ప్రజలకు ఎన్నికల సమయం వస్తున్నది కనుక ఏదో ఒక రీతిలో కలిసి వెళ్లాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలు అమలు చేసే విధంగా ప్రజలను కార్యకర్తల ద్వారా కూలి డబ్బులు ఇచ్చిన ప్రజలు బీఆర్ఎస్ పట్ల ఉన్న కోపంతో సమావేశాలు ఫెయిల్ అవుతున్నాయి, కార్యకర్తల సైతం బీఆర్ఎస్ పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ వీఆర్ఎస్ తీసుకుంటే మంచిదని, ఎన్ని సభలు పెట్టిన ప్రజలు మిమ్ముల్ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మరన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని, అందుకే కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు అనిల్‌గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు గోపాల్, సైదులుయాదవ్, శ్రీధర్‌రెడ్డి, అంజియాదవ్, ఇస్తార్, సంతోష్, మహిమూద్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహా ఏర్పాటుకు స్థల పరిశీలన..

**-వక్ఫ్ కాంప్లెక్స్ కూడలి వద్ద మున్సిపల్ అధికారుల పరిశీలన**



స్థల పరిశీలన చేపడుతున్న అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహా ఏర్పాటుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ముస్లిం సంఘాల బాధ్యులతో కలిసి బుధవారం స్థల పరిశీలన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వక్ఫ్ కాంప్లెక్స్, పోస్టాఫీస్, పుల్లారెడ్డి ఆసుపత్రి దారిలో గల సర్కిల్‌లో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహా ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ జయంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్‌గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్లాఖాన్, మున్సిపల్ కౌన్సిలర్ ఖాజాఖాన్, ముస్లిం సంఘాల పెద్దలు, కలాం చౌక్ సాధన కమిటీ సభ్యులతో కలిసి బుధవారం పరిశీలన చేశారు. ప్రధాన కూడలి మధ్యలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ముస్లిం సంఘాల నాయకులు కోరారు. ప్రధాన కూడలిలోని వక్ఫ్ కాంప్లెక్స్, పోస్టాఫీస్, ప్రహరి వద్ద, మార్కెటింగ్ శాఖ కాంప్లెక్స్ వద్ద విగ్రహా ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సూచన మేరకే మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేపట్టారని, 8 నుంచి 10 అడుగుల ఎత్తు మేర విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా స్థలాన్ని ఎంపిక చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. స్థల పరిశీలనలో నాయకులు హబీబ్‌ఖాన్, మొహమ్మద్ సాధిక్ పాషా, ముస్తాక్ అహ్మెద్, హమీద్‌ఖాన్, ఇసాక్ మియా, ఇమ్రాన్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, రియాజ్, అయ్యూబ్‌ఖాన్, కలీం, భాస్కర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## మంచిర్యాల బహిరంగ సభకు గద్వాల జిల్లా ప్రజలు తరలిరావాలి

**డిసిసి అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి**



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాహుల్‌గాంధి మీద అనర్హత వేటు ప్రజాస్వామ్యం కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈనెల 14న మంచిర్యాలలో బహిరంగ సభ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్‌లో భాగంగా ఈనెల 14న మంచిర్యాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభను విజయవంతం చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గద్వాల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధిని పార్లమెంట్ నుంచి బహిష్కరించడాన్ని నిరసిస్తూ ఈనెల 14వ తేదీన మంచిర్యాలలోని ప్రగతి మైదానంలో భారీ బహరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నారని జిల్లానుండి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గద్వాల కాంగ్రెస్ అధ్యక్షులు ఇసాక్, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్ జమాల్, అధికార ప్రతినిధి నందు, డిసిసి డెలికేట్ కర్ణాకర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్ర, జిల్లా జనరల్ సెక్రెటరీ అలెగ్జాండర్, అధ్యక్షులు రఘునాయుడు, బంగ్లాషఠ, మాజిద్, మైను, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి:ఎంపీపీ కిచ్చా రెడ్డి



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

**వనపర్తి రూరల్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** వనపర్తి మండల పరిధిలోని రాజపేట గ్రామంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ జ్యోతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి మాధవ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాజపేట గ్రామంలో 12రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని సర్పంచ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మీ, రైతు భీమా, రైతు బంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పెన్షన్లు, వృద్ధాప్య పెన్షన్లు, వితంతు పెన్షన్లు లాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్వేత, సింగిల్ విండో డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి, డా.కరుణ శ్రీ, వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మీ సాయినాథ్, రాజశేఖర్, శిరీష, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామస్థులు రాములు, తదితరులు పాల్గొన్నారు.

## నాటకాలను ప్రొత్సహిద్దాం... వాటిని కాపాడుకుందాం...

**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి**



**వెల్దండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** నాటకాలను ప్రొత్సహించి వారిని కాపాడుకుందామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో ఎల్లమ్మ బైలునాటకాన్ని ప్రదర్శించారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి నాటక దారులను అభినందించి రూ.30వేలను ఫౌండేషన్ సభ్యుల ద్వారా అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, చంద్రశేఖర్, కొండలుయాదవ్, జగన్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## గిరిజన విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా రాత్లావత్ మహేష్



**వెల్దండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కుందారం తాండకు చెందిన రాత్లావత్ మహేష్ గిరిజన విద్యార్థి సంఘం కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షులుగా నియమిస్తూ బుధవారం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ బంజార నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రోహిత్‌పవర్, సుధీర్, చక్రవర్తి తదితరులు ఉన్నారు.

## ఇంటర్వ్యూలు నిర్వహించిన బ్యాంకు మేనేజర్లు



**కెటిదొడ్డి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** కాలూరు తిమ్మనదొడ్డి మండల పరిధిలో మైనార్టీ కార్పోరేషన్ ఇంటర్వ్యూలు బుధవారం జరిగాయి. వివిధ బ్యాంకుల వారిగా ఇండియన్ బ్యాంకు వెంకటాపురం పరిధిలో 23 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 17 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎస్‌బిఐ గట్టు పరిధిలో 13 మంది దరఖాస్తు చేసుకోగా ఏడు మంది హాజరయ్యారు. ఎపిజివిబి ధరూర్ పరిధిలో ఇద్దరు దరఖాస్తు చేసుకోగా ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. యూనియన్ బ్యాంక్ మాచర్ల పరిధిలో ఇద్దరు దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు ఇద్దరు హాజరయ్యారు. మొత్తం 40 మందికి గాను 28 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకుల మేనేజర్లు, కెటిదొడ్డి మండల పంచాయతీ అధికారి అబ్దుల్ సయ్యద్ ఖాన్ పాల్గొన్నారు.

## కెవిపిఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..



**పీపనగండ్ల,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కెవిపి ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని కెవిపి ఎస్ మండల ప్రధాన కార్యదర్శి డి.మురళి తెలిపారు. డా.బీ.ఆర్. అం బేద్కర్ జ యంతి సందర్భంగా గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చేతులమీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభం జరుగుతుందని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

## దేవరకద్ర ఎస్ఐకి కౌకుంట్ల నేతల సన్మానం



**దేవరకద్ర,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** దేవరకద్రలో కొత్త ఎస్ఐగా పద విభాధ్యతలు చేపట్టిన జి.వెంకటేశ్‌కు బుధవారం కౌకుంట్లకు చెందిన యంపీటీసీ కిష్టన్న,వెంకటయ్యలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలసి పూలమాలు వేసి శాలువాలతో వారు సత్కరించారు.

## రాత్రిపూట శాంతి భద్రలను పర్యవేక్షిస్తున్న ఎస్సై రామన్‌గౌడ్..



**పీపనగండ్ల,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రాత్రి సమయంలో తమ సిబ్బందితో కలిసి శాంతిభద్రలను ఎస్సై రామన్ గౌడ్ పర్యవేక్షించారు. రాత్రి సమయంలో వీధి వీధి తమ సిబ్బందితో తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కలగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించారు. వీధిలో కనిపించిన యువకులకు తమ సమయాన్ని వృదా చేయకుండా కెరీర్‌ని ఎలా మలుచుకోవాలో అవగాహన కల్పించారు. ప్రజలు మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని ప్రజ లకు తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లు అయిన తమ పిల్లలకు డ్రైవింగ్ చేయడానికి వాహనాలు ఇవ్వరాదని, ఇది చాలా ప్రమాదాలకు దారితీస్తుందని సూచించారు.

## పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ జరగాలి..

**ఎంపిపి, జడ్పీటిసిలకు వినతి పత్రం ఇచ్చిన కార్యదర్శులు**



**కోయిల్‌కొండ,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని మండల పంచాయతీ కార్యదర్శులు బుధవారం మండల ఎంపిపి శశికళ భీంరెడ్డి, జడ్పీటిసి విజయభాస్కర్‌రెడ్డిలకు వినతి పత్రం సమర్పించారు. పంచాయతీ కార్యదర్శుల ప్రొహిబిషన్ పీరియడ్ నాలుగు సంవత్సరాల కాలం పూర్తయిన సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులంతా కేక్ కట్‌చేశారు. ఈసందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేసి పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన మాటను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండి ప్రజాసేవ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అప్పజెప్పిన పనులన్నింటిని దిగ్విజయంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఓపిఎస్‌లను, జెపిఎస్‌లుగా పరిగణిస్తూ రెగ్యులరైజ్ చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎంపిపి ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శ్రీలత, రఘుమారెడ్డి, వెంకటేష్,చైతన్య, రోజారాణి, రజిత, స్రవంతి,చంద్రకాంత్, నరేష్, సునిత పాల్గొన్నారు.

## రైతులకు నష్టం కలిగించే 3నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలి..



**వనపర్తి టౌన్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి ఆధ్వర్యంలో రాజనగరం వడ్డెగేరిలో అచలభారత కిసాన్ సబ ఆవిర్భవించి 88 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పరమేశ్వర చారి మాట్లాడుతూ స్వతంత్రానికి పూర్వ 1936లోనే ఏఐకెఎస్ ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం చేసిన ఘనత ఏఐకెఎస్ ఉం దని ఆ రోజు నుండి ఈరోజు వరకు రైతు సమస్యలపై తీవ్రమైన పోరాటాలు చేస్తూ రైతులకు సబ్సిడీ పరికరాలు, రుణాలు కొరకు పోరాడిన చరిత్ర ఉందని అన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే 3వ్యవసాయ నల్లచట్టాలను తీసుకొస్తే కంపెనీ వ్యవసాయం, రైతులు వాడే కరెంటు, మోటర్లకు మీటర్లు పెట్టే ఆలోచన, రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధరలు అమలుచేయకపోవడమేనని అన్నారు.రైతులకు నష్టం కలిగించే నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలని రైతులు 14నెలల పాటు వెనక్కి తగ్గకుండా ధర్నాలు చేస్తూ కూర్చున్న సమయంలో ప్రదాని నరేంద్రమోదీ దిగివచ్చి మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటానని చెప్పి నేటి వరకు పార్లమెంట్ లో దాన్ని అమలు చేయలేదని అన్నారు. రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలు తీసుకొస్తున్న సందర్భంలో ఈనెల 5వ తేదీన ఢిల్లీలో పెద్దఎఉత్తన నిరసన తెలపడం జరిగిందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే నల్లచట్టాలను వెనక్కి తీసుకొని పార్లమెంట్ బిల్లు పెట్టాలని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ఏఐకెఎస్ పోరాటం చేస్తుందనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు అంజి, మన్యం, ఖాజ బాష, మహిళ రైతులు సాలమ్మ, నాగమ్మ, అలివేల, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి:ఎంఈఓ



**తెల్కపల్లి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మన ఊరు మనబడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల విద్యాధికారి ఎస్. చంద్రుడునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో తెల్కపల్లి, లింగాల మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎస్. చంద్రుడునాయక్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం 2023,24 సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులకు సంబంధించి పాఠశాల యాజమాన్య కమిటి తీర్మాణం చేసి వెంటనే దర్జీలకు అందజేయాలని సూచించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థులకు సంబంధించిన 21 అదనపు వివరాలను పాఠశాలల వారిగా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రుడునాయక్‌తో పాటు మండల తొలిమెట్టు నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, తాహెర్‌పాషా, తెల్కపల్లి, లింగాల మండలాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

**బిజెపి జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మచారి డిమాండ్**



**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** కల్తీకల్లు తాగి అమాయక ప్రజలు 40 మంది దాకా అస్వస్థతకు గురై ఆసు పత్రి పాలైన సంఘటనకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర ఎక్సై జ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెంటనే రాజీనామా చేయా లని బిజెపి జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మచారి డిమండ్ చేశా రు. బుధవారం వారు జిల్లా ఆసుపత్రిలో వైద్యం పొందు తున్న బాధితులను చూసి వారికి ఎలాంటి వైద్యం అందుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంకిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీకల్లు లేదని చెబుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన సొంత నియోజకవర్గ పాలమూరు జిల్లా కేంద్రంలోని కల్తీకల్లుకు అడ్డాగా మారిందన్నారు. వారం రోజులుగా కల్తీకల్లు బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.కల్తీ కల్లు తాగి ఆరోగ్యాలు పాడు చేసుకుని అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉందని అన్నారు. మృతిచెందిన ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షాన బాధితుల తరపున భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, బిజెపి జిల్లా కార్యాలయ ప్రముఖ్ సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

## 5 లక్షల రైతుభీమా చెక్కును అందజేసిన ఎంపిపి

**గద్వాల ప్రతినిధి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** గట్టు మండలం చాగదోని గ్రామానికి చెందిన ఎస్. వజ్రమ్మకు ఐదు లక్షల రూపాయల భీమా చెక్కును చాగదోన గ్రామంలో ఎంపిపి స్వగృహంలో వజ్రమ్మకు అందజేశారు. గత నెలలో అనారోగ్యంతో గుండెపోటుకు గురై మరణించిన హరిజన చిన్న బొడ్డన్నకు రైతుభీమా సౌకర్యం ఉండడంతో వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఎంపిపి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతు పక్షపాతి గనుక రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రైతుబంధు ఉచిత కరెంటు రైతుభీమా వంటి పథకాలు,వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రూపాయలను సద్వినియోగం చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఎండి సుభాన్, గురన్న, ఈరన్న, జయరాంగౌడ్, కె. నర్సింలు, అశోక్, రవి, భాస్కర్, ఈరన్న,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరంజన్‌రెడ్డి ఓటమికి కారణమైన జూపల్లి తెలంగాణ ద్రోహి నువ్వు..

- నీ కుటిల బుద్ధి తెలుసుకున్న ప్రజలు
- నిన్ను యువ నాయకుడి చేతిలో ఓడగొట్టారు..
- జీతాలు ఇచ్చి ఆకు రౌడీలను ప్రోత్సహిస్తున్నావు..
- నీ రాజకీయ భవిష్యత్తు కోసమే తెలంగాణ పార్టీలోకి వచ్చావు..
- దమ్ముంటే వనపర్తి రాజీవ్ చౌరస్తాకు రా తేల్చుకుందాం..
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గట్టుయాదవ్

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మంత్రి నిరంజన్ రెడ్డిపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేసిన సమయంలో వనపర్తిలో తేల్చుతాను అని మాట్లాడిన జూపల్లి నీకు దమ్ము ధైర్యం ఉంటే వనపర్తి ప్రజల ముందుకు రాజీవ్ చౌరస్తాకు రా ప్రజలే తేలుస్తారు వస్తావా మరీ..! అంటూ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ జూపల్లి కి సవాల్ విసిరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడుతున్నావు నీకు సిగ్గుఉందా ఉద్యమం సాగుతున్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తో కలిసి సింగాయపల్లి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించావని అప్పటి ఉద్యమకారులను పోలీసులతో కొట్టించావు, అప్పటి గాయాలు ఇంకా మానలేదు ఇంకా ఎవరు మరిచిపోలేదు, ఉద్యమం సమయంలో కాంగ్రెస్ వాళ్ల మోచేతి నీళ్ల తాగుతూ ఉన్న నీవు తెలంగాణ రాష్ట్రం గులాబీ జెండాను భుజాన వేసుకొని తిరిగిన నిరంజన్ రెడ్డి గురించి మాట్లాడుతావా ఉద్యమంలోనే లేవు నీవు ఉద్యమకారులను ఏకం చేస్తావా? నీకు అంత దమ్ముందా అని ఆయన మండిపడ్డారు. తెలంగాణపై ప్రేమతో నీవు పార్టీలోకి రాలేదని, నీ రాజకీయ భవిష్యత్తు కోసం మాత్రమే వచ్చావని, నీ కుటిల బుద్ధి అందరికి తెలుసునని అన్నారు. మూడు పర్యాయాలుగా నిరంజన్ రెడ్డిని ఓడగొట్టడానికి నీవు చేస్తున్న పనులన్నీ తెలుసునని, ప్రజలంతా గమనిస్తున్నారని, నీ కుటిల బుద్ధి తెలుసుకున్న కొల్లాపూర్ ప్రజలు యువ నాయకుడు బీరం హర్షవర్దన్ రెడ్డి చేతిలో ఓడించి తగిన బుద్ధి చెప్పారని, మూడు సంవత్సరాలు పదవి లేకపోతే తట్టుకోలేక పిచ్చి ముదిరి పార్టీని, మంత్రి నిరంజన్ రెడ్డిని విమర్శిస్తున్నావని, నీకు పదవి వ్యామోహం తప్ప ఏమీలేదని, ప్రజలకు పూర్తి స్థాయిలో అర్థమవుతుందని ఆయన విమర్శించారు. ఉమ్మడి జిల్లా అన్ని నియోజకవర్గాల్లో చూపిస్తా అని చెప్పడం కంటే దమ్ము ఉంటే ఇతర పార్టీల దగ్గరకు వెళ్లి మోచేతి నీళ్ల తాగే కంటే స్వంతంగా పార్టీ పెట్టి నీ పెట్టి నీ సత్తా చూపొచ్చు కదా అని హితవు పలికారు. 2009లో టీఆర్ఎస్, కాంగ్రెస్ తో పొత్తులో భాగంగా నిరంజన్ రెడ్డి కి టికెట్ వస్తే గెలిపించాల్సింది పోయి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తో కలిసి స్వాతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచావని, 2014 ఎన్నికల్లో వనపర్తి నుండి పోటీ చేస్తున్న నిరంజన్ రెడ్డి గెలిస్తే మంత్రి పదవి రాదని గ్రహించి ఓడగొట్టావని, సీఎం కేసీఆర్, నిరంజన్ రెడ్డి కి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడుగా నామినేటెడ్ పదవి వచ్చిన తరువాత అభివృద్ధి లక్ష్యంగా పనిచేసుకుంటూ పోయారు అందుకే ప్రజలు వనపర్తి చరిత్రలోనే కనివిని ఎరుగని మెజార్టీని ఇచ్చి ఉన్నత స్థానంలో పెట్టారని, అలాంటి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్న మంత్రి నిరంజన్ రెడ్డి పై ఇష్టానుసారంగా అవాకులు చవాకులు పేల్చావంటే నీ అంతు చూస్తామని ఆయన హెచ్చరించారు. వనపర్తి రాజీవ్ చౌరస్తాకు వచ్చే దమ్ము నీకు ఉందా అని ఆయన జూపల్లి కృష్ణారావు ను ప్రశ్నించారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అబివృద్ధి కేవలం సీఎం కేసీఆర్ వల్లే జరిగిందని తమరు చేసింది ఏమీ లేదని మొత్తం నేనే చేసాను అని చెప్పడం సిగ్గుచేటు అని వీపనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్ రావు అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మెన్ బి.లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ పలుస రమేష్ గౌడ్,. బీఆర్ఎస్ నాయకులు శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు..

**-కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కిషన్‌రావు -కౌకుంట్లలో ఇఫ్తార్‌విందు**



కౌకుంట్ల ఇఫ్తార్‌విందులో బోజనాలు చేస్తున్న ముస్లింసోదరులు



హాఫిజ్‌కు సన్మానిస్తున్న కిషన్‌రావు

**దేవరకద్ర,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కౌకుంట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కిషన్‌రావు అన్నారు. కౌకుంట్లలో మంగళవారం రాత్రి ఉపవాసదీక్షలున్న ముస్లింసోదరులకు స్థానిక జామె మజీద్‌లో కిషన్‌రావు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కిషన్‌రావు మాట్లాడారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతకు సమయాన్ని కెటాయించాలన్నారు. మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులు అని అన్నారు. పండులను ప్రతి ఒక్కరు సామరస్యపూర్వకంగా ఆనందోత్సాల మద్య సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉపవాసదీక్షలున్న ముస్లింసోదరులకు నిర్దేశించిన సమయానికి ఖర్జూర పండ్లు తినిపించి ఉపవాసదీక్షలను కిషన్‌రావు విరమింపజేశారు.అలాగే ఇఫ్తార్‌విందు ఇచ్చిన కిషన్‌రావుకు స్థానిక ముస్లింసోదరులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు స్థానిక ముస్లింసోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఇది ఇలా ఉండగా బుధవారం కౌకుంట్లలో జమీల్ ఉపవాసదీక్షలున్న ముస్లింసోదరులకు స్థానిక జామె మజీద్‌లో ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు స్థానిక ముస్లింసోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**హాఫిజ్‌కు ఘనసన్మానం..** కౌకుంట్ల మండల కేంద్రంలో మంగళవారం రాత్రి స్థానిక మజీద్‌లో రంజాన్ సందర్భంగా ప్రతి రోజు రాత్రి తరావి నమాజ్ చదివిస్తున్న హాఫిజ్‌కు గ్రామ సీనియర్ నాయకుడు కిషన్‌రావు ఘనంగా సన్మానించారు.హాఫిజ్‌కు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులతో పాటు స్థానిక ముస్లింసోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్

**అమరచింత,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని పీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ తో కలిసి కేశం నాగరాజుగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర, పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర వల్ల దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చిందని వారు అన్నారు. బీజేపీ పార్టీని భుజాన మోస్తున్న ఆదానీ, ఆదానీ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించినందుకే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్ని అనర్హత వేటు వేసిందని ఆయన అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన, ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదని ఆయన అవహేళన చేశారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తక్షణమే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.2లక్షలు, మహిళలకు రూ.500 సిలిండర్ అందిస్తామని ఆయన తెలిపారు. పేపర్ లీకేజీల పేరుతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. అలాగే నష్టపోయిన నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కరికి రూ.1లక్ష ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 14న మంచిర్యాలలో డా.బీ.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా భారీ బహిరంగ నిర్వహిస్తున్నామని, ఈ బహిరంగ సభకు ఏఐసీసీ నాయకులు, పీసీసీ నాయకులు వస్తున్నారని ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.జి.మహిందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎస్.ఎం.అరుణ్ కుమార్, యువజన కాంగ్రెస్ మక్తల్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రహిముద్ ఉల్లా, శ్యామ్, ప్రకాశం, తౌఫిక్, లక్ష్మీకాంత రెడ్డి, కృష్ణ నాయక్, నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీ.ఎం.ఆర్.బియ్యాన్ని ఎఫ్‌సిఐకి సత్వరమే అందజేయాలి...



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ మోతిలాల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:**జిల్లాలో రబీ 2022 సంవత్సరానికి సంబంధించిన సీ.ఎం.ఆర్ బియ్యాన్ని సంబంధిత మి ల్లర్లు సత్వరమే ఈనెల 30నాటికి నేరుగా ఎఫ్‌సీఐకి అందించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోతిలాల్ సభావత్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ హిమాలయ రెస్టారెంట్‌లో జిల్లా లోని మిల్లర్ల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి హజరైన అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ గత రబీకి సంబంధించి ధాన్యం జిల్లాలో 124 మిల్లులకు అందించగా ఇప్పటి వరకు 3 మిల్లులు నూరు శాతం సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి అందించారని, మిగతా మిల్లులు ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యం పూర్తి స్థాయిలో అందించలేకపోవడంపై మిల్లర్లపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నెల 30వరకు విధించిన గడువు లోగా సీఎంఆర్ బియ్యం మిల్లర్లు ఆ దిశగా సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. 80 నుంచి 99 శాతం ఉన్న మిల్లులు నూరు శాతం పూర్తి చేసి ఎఫ్‌సీఐకి సత్వరమే సీఎంఆర్ బియ్యం పెట్టాలని, సీఎంఆర్ పూర్తి చేసిన మిల్లర్లతో షేరింగ్ చేసుకొని నిర్దేశించిన గడువు లోపు అందించాలని, బకాయి మిల్లర్లకు సూచించారు. సీఎంఆర్ బియ్యం కూడా ఎఫ్‌సీఐకి పెట్టాలని మిల్లర్లకు సూచించారు. ఎవరైతే మిల్లర్లు గడువు లోగా ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యాన్ని అందజేయకపోతే అట్టి మిల్లర్లకు రానున్న ఎండకాలం వడ్లను అందజేయడం జరగదని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్‌బాబు, జిల్లా మిల్లర్స్ అధ్యక్షులు జూలూరి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, నవీన్, హకీం రాజేష్, ఉప్పునుంతల జెడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి, జిల్లాలోని మిల్లర్లు తదితరులు ఉన్నారు.

# జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలి...



వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

**వెల్దండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:**జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు డీఆర్‌డీఓ పీడీ నర్సింగ్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ విజయజైపాల్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్య డ్యూటీలకు వెళ్తే రాత్రి ఏ సమయమైనా విధులు పూర్తి చేస్తున్నామని, విధి నిర్వహణలో పని భారం వలన సుమారు 20 మృతి చెందారని, 100ల మంది క్షతగాత్రులయ్యారని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందలేదన్నారు. బాధిత పంచాయతీ కార్యదర్శులకు చందాలు వేసుకొని ఆదుకున్నామన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల క్యాడర్‌ను గుర్తించి ప్రకటించాలన్నారు. 317 జీవో ప్రకారం నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేసి పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. పంచా యతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎంపీటీసీలు మోతిలాల్‌నాయక్, రాము లు, గుత్తి వెంకటయ్య, చక్రవర్తిగౌడ్, పంచాయతీ కార్యదర్శులు ఫయాజ్, గిరి, అల్తాఫ్, మురాహరచారి, స్వప్న, మంజుల, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నేడు దేవరకద్రలో కలెక్టర్,ఎమ్మెల్యే ఆల పర్యటన

**దేవరకద్ర,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** దేవరకద్రలో గురువారం కలెక్టర్ రవి,ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు పర్యటించనున్నారు. బుధవారం వారు పర్యటించాల్సి ఉండగా అని వార్య కారణాల కారణంగా ఆ కార్యక్రమం గురువారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 10లకు స్థానికంగా తుది ధశకు చేరుకొన్న ఫ్లైఓవర్ వంతెన పనులను వారు పరిశీలిస్తారు. అలాగే అక్కడ చేపట్టే సర్వీసు రోడ్డు గురించి చర్చిస్తారు. అలాగే బస్టాండు ఆవరణలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలిస్తారు.అనంతరం యంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో జరిగే రివ్యూ సమావేశంలో వారు పాల్గొంటారు.కావున ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,పార్టీ అనుబంద సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ కోరారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 1189 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2106 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.1619 ధర పలికింది. అలాగే 21 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.1711 ధర పలికింది. అతి తక్కువగా రూ.1621 ధర పలికింది. అలాగే 53 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.5859 ధర పలికింది. అతి తక్కువగా రూ.5750 ధర పలికింది. అలాగే 512 కింటాళ్ళ ఉల్లిని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ఉల్లికి అత్యదికంగా రూ.950 ధర పలికింది. అతితక్కువగా రూ.610 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## మండల సభలో మిషన్ భగీరథపై రగడ



**కోయిల్‌కొండ,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :**మండల సర్వసభ్య సమావేశ ఎంపిపి శశికళ భీంరెడ్డి అధ్యక్షతన బుధవారం కొనసాగింది. మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు హాజరయ్యారు. మండల సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగానే కొత్లాబాద్ గ్రామ ఎంపిటిసి సత్యంగౌడ్ మాట్లాడుతూ మా గ్రామానికి వారంలో రెండు,మూడుసార్లు మాత్రమే మిషన్ భగీరథ మంచినీరు సరఫరా అవుతుందని సభలో ఆయన మిషన్ భగీరథ అదికారుల పనితీరుపై మండిపడ్డారు. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం మూలంగా మంచినీటి సరఫరాలో అవకతవకలు ఏర్పడుతున్నాయని మండలసభలో ఆయన అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచైనా గ్రామానికి మంచినీటిని అందించాలని ఆయన సభా దృష్టికి తీసుకొచ్చారు. గార్లపాడు గ్రామంలో మిషన్ భగీరథ మంచినీరు కొన్ని వీధులకు సరఫరా కావడం లేదని ఎంపిటిసి జయలక్ష్మి మండల సభ దృష్టికి తీసుకొచ్చారు. కేశవాపూర్ గ్రామంలో కబ్రస్థాన్ కబ్జాకు గురవుతుందని గ్రామ సర్పంచ్ మొగులయ్య సభా దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలలో కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు వస్తాయని సభ్యులు మండల సభలో సభా దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి. కృష్ణ, సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయకర్త మల్లయ్య యాదవ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బి. కృష్ణ, మండల తహసిల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపిడిఓ జయరాం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## రైతుభీమా రూ. 5 లక్షల చెక్కు అందజేసిన గట్టు ఎంపిపి జె. విజయ్‌కుమార్



**గట్టు,ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చాగదొన గ్రామానికి చెందిన హరిజన చిన్న బొడ్డన్న గత నెలలో గుండె పోటుకు గురై మరణించడం జరిగింది. ఆ రైతుకు కెసిఆర్ రైతుభీమా పాలసీ ఉండడంతో బుధవారం మృతుని భార్యకు రూ. 5 లక్షల భీమా చెక్కును ఎంపిపి స్వగృహంలో అందజేశారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపిపి విజయ్‌కుమార్ చేతుల మీదుగా రైతు భీమా 5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండి సుభాన్, గురన్న, ఈరన్న,జయరాంగౌడ్, కె. నర్సింలు, అశోక్, రవి, భాస్కర్, వీరేష్ పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు..!

**మొదటిపేజీ తరువాయి భాగం...**



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

తమకు మేలు చేసిందో గ్రామాల్లో ప్రజలు చర్చ జరపాలని, పనిచేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యదర్శులతో గ్రామాల్లో మెరుగైన పాలన పంచాయతీ కార్యదర్శులతో గ్రా మాల్లో పాలన మరింత మెరుగైందని, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు నాలుగేళ్ల పదవికాలం పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరు పుకున్నారు. గ్రామీణులకు ప్రభుత్వ పథకాలను మరింత దగ్గరచేసి తమవంతు పాత్ర పోషించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే గంగాపూర్‌లో పర్యటించారు. స్మశాన వాటిక నిర్మాణానికి, బిసి కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంతో పాటు మౌలిక వసతులు మెరుగయ్యాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ కోడ్గల్ యాదయ్య, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి రవిందర్, మార్కెట్ కమిటి ఛైర్మన్ మన్నె గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్‌గౌడ్, ఉమాశంకర్‌గౌడ్, నాయకులు నాగిరెడ్డి, శ్రీకాంత్, టైగర్ నరసింహులు, రామ్మోహన్, జీన్గురాల సత్యం పాల్గొన్నారు.

## జిల్లాలో తొలిసారిగా గురువారం నుంచి పది మూల్యాంకనం...

**మొదటిపేజీ తరువాయి భాగం..**

నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన సబ్జెక్టు నిపుణుల జాబితా రూపొందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు వారికి ఆర్డర్ కాపీలను సైతం పంపించారు. 500 మంది ఉపాధ్యాయులు సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు డీఈఓ తెలిపారు.

**నిఘా నడుమ మూల్యాంకనం, సెల్‌ఫోన్‌కు అనుమతి లేదు...**

మూల్యాంకనం కేంద్రంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా నిఘా నడుమ నిర్వహిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు పేర్కొన్నారు. మూల్యాంకనానికి వచ్చే ఎగ్జమినర్లు సమయపాలన పాటించాలన్నారు. నియమ నిబంధనలు పాటిస్తూ మూల్యాంకనం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సెల్‌ఫోన్లు మూల్యాంకన కేంద్రంలోకి అనుమతి లేదు.

## నేడు నర్వ మండలంలో పర్యటించనున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** నేడు జిల్లా కలెక్టర్ నర్వ మండల పర్యటన సందర్బంగా అక్కడి స్థానిక ప్రజలు తమ ప్రజావాణి ఫిర్యాదులను ఇక్కడే ఇచ్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీన గురువారం జిల్లా కలెక్టర్ నర్వ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నారని ఈ సందర్బంగా అక్కడి స్థానిక ప్రజలు తమ సమస్యలు ఉంటే అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మధ్యాహ్నం నర్వ మండల తహసిల్దార్ కార్యాలయంలో 12 గం.ల నుండి 1 గం.లవరకు ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. నర్వ మండలానికి సంబంధించిన భూ సమస్యలతో పాటు ఇతర ఫిర్యాదులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని నర్వ మండల ప్రజలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పెండింగ్ కేసులపై నెలవారి సమీక్ష సమావేశం

**నిర్వహించిన డీఎస్పీ సత్యనారాయణ**



సమీక్ష నిర్వహిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** బుధవారం సాయంత్రం డీఎస్పీ కె. సత్యనారాయణ కోస్గి సర్కిల్ పోలీసులకు డీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా డీఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరగా పూర్తి చేయాలని కోర్టులలో కలిగి ఉండి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. మహిళల భద్రత కోసం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వారికి అన్ని రకాల భద్రతా విషయాల్లో ఎల్లప్పుడు సహకారం అందించాలని తెలి పారు. మహిళలపై జరిగే నేరాలు పోక్సో యాక్ట్ ప్రకారం 60 రోజులలో పరిశోధన పూర్తి చేయాల న్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండి వారి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐ జనార్ధన్, ఎస్సైలు శ్రీనివాసులు, నరేష్ పాల్గొన్నారు.

## ఎన్నికల ఓటరు జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**మొదటిపేజీ తరువాయి భాగం...**

కలిగినవి, మరణించిన ఓటర్లు, స్థానికంగా లేకుండా ఇతర ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్న ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించినట్లయితే తొలగించిన పేర్లను పున: పరిశీలించాల్సిందిగా సూచించారు. పేర్ల తొలగింపులో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని మరణించిన ఓటర్ల పేర్లు తొలగించడానికి మరణధృవీకరణ పత్రం, ఫారం 7 క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. బూత్ లెవల్ అధికారులను ప్రభుత్వం ద్వారా గౌరవ వేతనం పొందుతున్న వారిని తప్ప ప్రయివేట్ ఉద్యోగులను లేదా మహిళాసంఘాల వ్యక్తులను బిఎల్ఓలుగా నియమించడానికి వీలు లేదన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో సంవత్సర కాలంలో 296 మంది మరణించిన లేదా ఒకే ఫోటో రెండు చోట్ల కలిగి ఉండడం లేదా స్థానికత మార్పిడి చేసుకున్న ఓటర్ల పేర్లను పూర్తి విచారణ అనంతరమే తొలగించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. విడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఆర్డీఓ రాంచందర్ నాయక్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## కల్తీ కల్లు ఘటన ప్రభుత్వ వైఫల్యమే ..

**- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ - మృతులకు రూ.కోటి పరిహారం చెల్లించాలి**



మీడియాతో మాట్లాడుతున్న డీకే అరుణ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** కల్తీ కల్లు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని, ఎక్సైజ్ శాఖ మంత్రి అందుకు బాధ్యత వహించి రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తండాల్లో గుడుంబా వ్యాపారానికి అడ్డుకట్ట వేసి స్వచ్ఛమైన కల్లు విక్రయాలు చేపడుతామని చెప్పి కల్తీ కల్లు వ్యాపారం చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతారా అని ప్రశ్నించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతులు కుటుంబాలకు రూ.కోటి, బాధితులకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ, టెన్త్ క్లాస్ పేపర్ల లీకేజీ వ్యవహారంలోనూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పులను ఒప్పుకోకుండా బీజేపీపై మోపేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, రాష్ట్ర నాయకురాలు పద్మజారెడ్డి, నేతలు ఎన్‌పీ వెంకటేశం, అంజయ్య పాల్గొన్నారు.

## ఎంపిడిఓకు వినతి పత్రం అందజేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



**మూసాపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ స్వరూపకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతి పత్రం అందజేశారు. మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, ఎంపిడిఓ స్వరూప ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి జడ్పీటిసి, ఎంపిడిఓలతో పాటు ఉపాధి హామీ అధికారులను ఘనంగా సన్మానించారు. అనంతరం తమ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలు గడిచిందని ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని ఎంపిడిఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సురేష్, మహేందర్, సతీష్‌రెడ్డి, రాఘవేందర్, మాధవి, ప్రత్యూష, పార్వతమ్మ, మురళీధర్‌గౌడ్, నాగేందర్‌గౌడ్, అచల్, వెంకటమ్మ ఉన్నారు.

# ప్రతి కుటుంబానికి తెలంగాణ సంక్షేమ పథకాలు..!



మాట్లాడుతున్న ఢిల్లీ అధికార ప్రతినిధి మంద జగన్నాథ్



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత



హాజరైన కార్యకర్తలు

**232 కోట్లతో ఇటిక్యాల మండలంలో 9 ఏళ్లలో వివిధ అభివృద్ధి పనులు**

**కొండేరు స్టేజీలో గులాబీ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఢిల్లీ అధికార ప్రతినిధి మంద, జడ్పీ చైర్మన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం**

**ఇటిక్యాల, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అదేవిధంగా అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి ప్రతి సంక్షేమ పథకం అందుతుందని మండలంలో తొమ్మిదేళ్ల కాలంనుండి 232 కోట్ల 52 క్షలతో బిటి రోడ్లు, సిసి రోడ్లు, రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి తదితర పథకాల కింద ప్రజలకు సహాయం అందుతుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం వివరించారు. బుధవారం మండల పరిధిలోని కొండేరు గ్రామ స్టేజీలో గులాబీ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, జడ్పీ ఛైర్మన్ సరిత, అలంపూర్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ మాజీ ఇంఛార్జి మంద శ్రీనాథ్, సిపిఐ జిల్లాకార్యదర్శి ఆంజనేయులు హాజరయ్యారు. ముందుగా ఇటీవల మరణించిన సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ జడ్పీటిసి ఖగునాథ్‌రెడ్డి, అయిజ మండల సీనియర్ రాజకీయ నాయకుడు తిరుమల్‌రెడ్డి చిత్రపటాలకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే అబ్రహాం మాట్లాడుతూ సీమాంధ్ర ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో వెనుకబడందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై ముఖ్యమంత్రి కెసిఆర్ ఉద్యమ సమయంలో చావు అంచుల దాకా వెళ్లి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన రథసారథి అని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి పాలనలో 9 ఏళ్లలో రైతులకు 24 గంటల పాటు విద్యుత్, రైతుబంధు, రైతుభీమా, మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు వంటివి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి పథకాలు అందుతున్నాయని చెప్పుకోవచ్చన్నారు. కేంద్రబిజెపి ప్రభుత్వం సంస్థలను అమ్మి ఆదాని అంబానిల కార్పోరేట్ స్థాయి కంపెనీలకు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తుందని అంతేకాక మేధావులు, రచయితలు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తున్నారని, సింగరేణి, విశాఖ ఉక్కు కర్మాగారాలను ప్రధానమంత్రి, మోడీ, హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో తన మిత్రుడు ఆదానికి అమ్మేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని మహిళలకు ప్రాధాన్యత కల్పించిందని అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రతిఇంటికి మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటివసతి కల్పించిందని రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అర్హులైనవారికి పింఛన్లు అమలు చేస్తుందని వచ్చే6 నెలల్లో జరిగే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని పార్టీలో స్థానిక ఎమ్మెల్యే అందరిని కలుపుకుపోయే విధంగా చూసుకోవాలని జడ్పీ ఛైర్మన్ సరిత వివరించారు.

అనంతరం ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో తాను 4 సార్లునాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపిగా పని చేస్తున్న సమయంలో అలంపూర్ నియోజకవర్గం నా పరిధిలో లేకున్నా నియోజకవర్గ నాయకులు అభివృద్ధి పనుల కోసం తన వద్దకు వస్తే పనులు చేశానని అలాగే 2009 ఎంపి ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోకి రావడంతో తాను ఎంపిగా గెలిచిన సమయంలో నియోజకవర్గం అభివృద్ధి చేశానని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో అలంపూర్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు 783 కోట్లతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం. అంతేకాక అలంపూర్ చౌరస్తాలో 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించడంలో తనపాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. ముగింపు రోజు జరిగిన కొండేరు గులాబీ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి సర్పంచ్ ఈరన్న ప్రత్యేక చొరవ తీసుకుని సమావేశానికి పెద్ద సంఖ్యలో మహిళలను తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకుడు డా.అజయ్, ఆర్డీఎస్ ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ సీతారాంరెడ్డి, జడ్పీటిసి రాజు, సంకాపురం రాముడు, స్థానిక మండల బిఆర్ఎస్‌పార్టీ నాయకులు సర్పంచ్ ఈరన్న, గిడ్డారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గుమ్మ గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి తిరుపతిరెడ్డి, నీలి శ్రీనివాసులు, బొట్టు వీరన్న, శివుడు, సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, మల్లన్న, మధునాయుడు, సుంకన్న రాగన్న, లక్ష్మన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మహిళా కార్యకర్తలు, పాల్గొన్నారు.

## తక్కువ సమయంలో రెండు ప్రాపర్టీ కేసులు, ఇద్దరు నేరస్థులను పట్టుకున్న వనపర్తి పోలీసులు..



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె మూర్తి



పోలీసు అధికారులకు నగదు పురస్కారం అందజేస్తున్న ఎస్పీ

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన రెండు ప్రాపర్టీ కేసులను జిల్లా పోలీసు అధికారులు చేధించి ఇద్దరు నేరస్థులను పట్టుకున్నారని జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి తెలిపారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పోలీసులు మానవ మేధాస్సుతో పాటు సాంకేతిక ఆదారాలను ఉపయోగించి రికార్డు సమయంలో రెండు కేసులను గుర్తించారు. 12/04/2023 ఉదయం 9,30గంటలకు వనపర్తిలోని డా.చల్మారెడ్డి ఆసుపత్రి ముందు లేబర్ అడ్డాకు చేరుకున్న పోలీసు బృందం నిందితులను ఎ-1 రాయగిరి గణేష్, ఎ-2 అదేం మహేష్ లను పట్టుకున్నారని అన్నారు. విచారణలో నిందితులు పై రెండు నేరాలను అంగీకరించారు. చోరీ చేసిన నగదు మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఆమె తెలిపారు. నిందితులతో సీఆర్ నెంబర్ 55/2023 యు/ఎస్ 363, 392 ఐపీసీ, రూ.5వేలు, 17తులాల వెండి బ్రాస్లెట్, విలువ సుమారు రూ.12వేలు ఫిర్యాదుదారుల యొక్క ఒక సామ్‌సాంగ్ మొబైల్ ఫోన్, హీరో హోండా సీడీ 100 మోటార్ సైకిల్ నెంబర్ ఏపీ 22-బీ-4832 లను స్వాధీనం చేసినట్లు ఆమె తెలిపారు. కేసును చేధించిన వారిలో వనపర్తి సర్కిల్ ఎన్.శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ఎస్సై యుగంధర్ రెడ్డి, పట్టణ ఎస్సై కె.రాము, మహేశ్వర్, నరేష్, అశోక్, నాగరాజు, నిరంజన్ లు పాల్గొన్నారు. తక్కువ సమయంలో కేసును చేధించిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించి నగదు పురస్కారం అందజేశారు.

## గడపగడపకు కాంగ్రెస్ హాత్ సే హాత్ జోడో యాత్ర..



తాండాలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్న జీఎంఆర్

**అడ్డాకుల, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిమ్మాయిపల్లి తాండాలోహాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించి గ్రామంలో గడప గడపకు వెళ్లి రాహుల్ గాంధీ సందేశాన్ని తెలిపి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ ప్రణాళికను ప్రజలకు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి వివరించారు. తాండాలోని ప్రతి గడపకు తిరుగుతూ తాండా వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు జీఎంఆర్ తో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న బీఆర్ఎస్ నాయకులు తమకు ఇండ్లు ఇవ్వకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు విన్న జీఎంఆర్ వచ్చే సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు తాండా వాసులు జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు జీఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సాదిక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్వర్ , మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, తిమ్మాయిపల్లి మాజీ సర్పంచ్ హనుమంతు నాయక్, గ్రామ అధ్యక్షుడు రాజు, నిల్య నాయక్, జె.రాజ్ కుమార్, గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఇల్లు కాలిపోయిన బాధితులకు ఆర్థికసాయం అందించిన ఎంపీపీ మేఘారెడ్డి..



**పెద్దమందడి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకోని సర్వం కోల్పోయిన కుటుంబానికి నేనున్నానంటూ ధైర్యం కల్పించి తక్షణ సహాయంగా రూ.10వేల ఆర్థిక సహాయం ఎంపీపీ మేగారెడ్డి అందించారు. పెద్దమందడి మండలం, చిన్నమందడి గ్రా మంలో బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు తన గుడిసెకు నిప్పంటు కొని మాల వెంకటస్వామి కుటుంబం సర్వం కోల్పోయింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ మేఘారెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకోని పరిస్థితులను పరిశీలించారు. తక్షణ సహాయంగా ఆ కుటుం బానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి తన వం తు చేయూతనందిస్తానని ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేఘారెడ్డికి ఆ కుటుంబ సభునయులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రగతి స్పిన్నింగ్ ఆధ్వర్యంలో చలివేంద్ర ప్రారంభం..



**అడ్డాకుల, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రగతి స్పిన్నింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎండి జితేందర్ ప్రసాద్ బాబు ఆదేశానుసారం వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయితీ పర్యవేక్షణలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మానవదృక్పథంతో సేవా బావంతో చలివేంద్రాన్ని ఎస్సై మాధవ రెడ్డి ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస జనరల్ మేనేజర్ వెంకట రాములు, వెంకటయ్య గౌడ్, అజయ్ కుమార్, కోటేశ్వర్ రావు, సర్పంచ్ మంజుల భీమన్న యాదవ్, సీనియర్ నాయకులు చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటి ఛైర్మన్‌కు సన్మానం



**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** నూతనంగా ఎన్నుకోబడిన నారాయణపేట మార్కెట్ కమిటి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు, మార్కెట్‌యార్డు కార్యాలయంలో మార్కెట్ ఛైర్మన్ జ్యోతి బుల్లెట్, రాజు, వైస్ ఛైర్మన్ ఎం. లక్ష్మికాంత్, మార్కెట్ డైరెక్టర్ కాకర్ల నారాయణమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో బోయన్‌పల్లి తండా ఉపసర్పంచ్, నారాయణపేట బిఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్, నారాయణపేట మండల మైనార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ అరిఫ్ ఖాద్రి, బోయిన్‌పల్లి తండా వార్డు సభ్యుడు వెంకటేష్, అమ్మిరెడ్డిపల్లి గోవిందు పాల్గొన్నారు.

# కొండేరులో ఆత్మీయ సమ్మేళనంలో బయటపడ్డ లుకలుకలు..!

**గులాబీ పార్టీ ఆత్మీయ సమ్మేళన ఆహ్వానంలో కనిపించని ఢిల్లీ అధికార ప్రతినిధి మంద, జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత పేర్లు**



కొండూరు గ్రామంలో జరిగిన గులాబీ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అబ్రహాంపై ఢిల్లీ అధికార ప్రతినిధి మంద జగన్నాథం అసంతృప్తిని వ్యక్తం చేయగా మైకు తీసుకుని మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహాం

**ఇటిక్యాల, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మంద పరిధిలోని కొండేరు గ్రామ సమీపంలో బుధవారం జరిగిన అలంపూర్ నియోజకవర్గ గులాబీ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభలో నియోజకవర్గంలో ఉన్న గులాబీ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నట్లు, లుకలుకలు కనిపించి ముగింపు రోజు పార్టీలో విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయని చెప్పవచ్చు. గులాబీ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో స్వయంగా ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితలపేర్లు పార్టీ గ్రూపులో, మీడియాకు పంపించే గ్రూపులలో ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించే పేర్లలో తమపేర్లు లేకుండా చేస్తున్నారని అలంపూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులము అంతేకాక క్యాబినెట్ హోదా కలిగిన తమను పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా ఆహ్వానించే వారిలో తమ పేర్లు లేకుండా చేస్తూ కేవలం ఇంఛార్జి తక్కెలపల్లి రవింద్రరావు, ఎమ్మెల్యే అబ్రహాం, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డిలు హాజరవుతున్నట్లు క్యాంపు కార్యాలయం నుండి ఆహ్వానం పంపే సమాచారంలో తమ పేర్లు లేకుండా ఎమ్మెల్యే తమను అగౌరవపరుస్తున్నారని ఇదిమంచి పద్దతి కాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో ప్రతి మండల పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతున్నానని కాని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి పంపే ఆహ్వానంలో తన పేరు లేకుండా పంపడం ఎందుకని మహిళా జడ్పీ ఛైర్మన్‌గా కొనసాగుతున్న ఇలా అగౌరవపరచడం మంచి పద్దతి కాదని మరోసారి ఇలాంటి ఘటనే జరిగితే సమావేశాలకు హాజరు కాబోనని జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత స్పష్టం చేశారు. అదేవిధంగా ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీఎంపి జగన్నాథం మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర ఎంతో ఉందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బిల్లు పాస్ అవుతున్న రోజు లోక్‌సభలో సీమాంధ్ర ఎంపిలతో గొడవలకు దిగి తెలంగాణ బిల్లు పాస్ చేయించడంలో ఎంతో కృషి చేశామని అలంపూర్ నియోజకవర్గంలో 2014కు ముందు తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించానని అలాంటి నాకు స్థానిక ఎమ్మెల్యే అబ్రహాం ఆత్మీయ సమ్మేళన ఆహ్వానంలో తనపేరు లేకుండా చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. వాస్తవానికి పార్టీలోని వర్గ విభేదాలు లేకుండా చేసుకునేందుకు పార్టీ అధిష్టానం ఎమ్మెల్యేల ద్వారా ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకుని అందరు కలిసి పార్టీ బలోపేతం చేసుకునేందుకు ఆత్మీయ సమ్మేళనం కానీ క్యాబినెట్ హోదా కలిగిన మమ్మల్ని ఆహ్వానంలో ముఖ్య అతిథులుగా తమపేర్లు లేకుండా చేస్తూ ఎమ్మెల్యే అబ్రహాం చేయడం ఏంటని అసంతృప్తి వ్యక్తం చేయగా సభకు భారీగా హాజరైన కార్యకర్తలు ఒక్కసారిగా అవాక్కయ్యారు. దీంతో ఎమ్మెల్యే అబ్రహాం జరిగిన పొరపాటును ఒప్పుకోకపోవడం కొసమెరుపు.